క్లుప్తంగా

విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు


కరపత్రాలు పంచుతున్న సీపీఎం నాయకులు

పార్వతీపురం టౌన్‌: విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు అని సీపీఎం పట్టణ కమిటీ కార్యదర్శి జి.వెంకటరమణ అన్నారు. శనివారం ప్రధాన రహదారిలో సీపీఎం ఆధ్వర్యంలో కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం అక్టోబర్‌ 5వ తేదీన విశాఖపట్నంలో కూర్మన్నపాలెం స్టీల్‌ ప్లాంట్‌ ఆర్చ్‌ వద్ద సాయంత్రం 4 గంటలకు జరిగే బహిరంగ సభకు ప్రజలు తరలి రావాలని కోరారు. బహిరంగ సభలో సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, సంచాన ఉమాల తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మక్కువ: మండలంలోని అనసభద్ర గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ఒడిశా రాష్ట్రం నారాయణపట్నం సమీపంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. శనివారం బాధిత కుటుంబాలను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు పరామర్శించారు. ముగ్గురు యువకుల కుటుంబ సభ్యులను రంగునాయుడు కలిసి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వ పరంగా కుటుంబాలను ఆదుకునేలా కృషి చేయాలని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర దృష్టికి తీసుకు వెళ్లానని, అధైర్య పడవద్దని హామీ ఇచ్చారు. మీకు ఎప్పుడు ఏ అవసరమొచ్చినా, అన్ని సమయాల్లో మీకు అందుబాటులో ఉంటానని రంగునాయుడు భరోసా ఇచ్చారు.

'భోజనం' పరిశీలించిన డీఈఓ


మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్‌

పార్వతీపురం టౌన్‌: జగనన్న గోరుముద్ద కార్యక్రమం అమలు, వాటి తీరు తనిఖీల్లో భాగంగా శనివారం పార్వతీపురం మండలం తాళ్లబురిడి ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన పథకం పనితీరును డీఈఓ ఎన్‌.ప్రేమ్‌కుమార్‌ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం తీరు, పాఠ్యాంశాలపై పలు విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల విద్యా కమిటీ సభ్యులకు, ఉపాధ్యాయులకు, భోజనం వండి పెడుతున్న మహిళలకు పలు సూచనలు జారీ చేశారు. ఈ తనిఖీల్లో ఎంఈఓ విమలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

దబ్బగెడ్డలో పశువైద్య శిబిరం


మూగజీవికి పరీక్ష చేస్తున్న పశువైద్యాధికారి పోలందొర

మక్కువ: మండలంలోని దబ్బగెడ్డ గ్రామంలో పశువైద్యాధికారి కె.పోలందొర పశువైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. గ్రామంలోని రైతులు పశువైద్య శిబిరం వద్దకు పాడిపశువులు తీసుకురాగా, వాటికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందించారు. పాడి పశువులు పెంపకంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. మూగజీవులు వ్యాధుల బారిన పడితే, గోపాలమిత్రలకు సమాచారం అందించాలన్నారు. నేరుగా మక్కువ పశువైద్యాస్పత్రికి తీసుకువస్తే, సకాలంలో వైద్యం అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు.

గురుకుల విద్యార్థి ప్రతిభ


శ్రీనివాసరావును అభినందిస్తున్న ప్రిన్సిపాల్‌, సిబ్బంది

సాలూరు: రాష్ట్ర స్థాయి స్కూల్‌ గేమ్స్‌ పోటీలకు పాచిపెంట మండలం పి.కోనవలస గిరిజన గురుకుల బాలుర పాఠశాల విద్యార్థి అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్‌ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ, సీతానగరం జెడ్పీహెచ్‌ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ అండర్‌ –17 వాలీబాల్‌ జిల్లా స్థాయి పోటీల్లో పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న డి.శ్రీనివాసరావు గెలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థిని ప్రిన్సిపాల్‌, పీడీ, పీఈటీ, సిబ్బంది శనివారం అభినందించారు.

అందరికీ ఆరోగ్య రక్ష



మక్కువ: వెంకటబైరిపురంలో వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర, పార్వతీపురం టౌన్‌ వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే జోగారావు

- ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర
- 'జగనన్న ఆరోగ్య సురక్ష'కు ప్రజా స్పందన

సాలూరు: ప్రజారోగ్యమే మహాభాగ్యంగా భావించి ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టారని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని అన్నంరాజువలస, పాచిపెంట మండలం విశ్వనాధపురం గ్రామాల్లో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడమే కాకుండా శిబిరాల వద్దకు రాలేని రోగుల ఇళ్ల వద్దకే వైద్య సిబ్బంది వెళ్లి సేవలు అందిస్తారన్నారు. అవసరమైన మందులు కూడా అందజేస్తారన్నారు. దీర్ఘకాలిక రోగులకు అవసరమైతే ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్సలు కూడా చేయించనున్నట్టు తెలిపారు. రోగులకు అండగా ప్రభుత్వం ఉంటుందన్నారు. ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో అవసరమైన మందులు, పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. నవంబరు 10 వరకు శిబిరాలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా ఆయన కూడా ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం అన్నంరాజువలసలో ఐసీడీఎస్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన గర్భిణుల సామూహిక సీమంతాల కార్యక్రమంలో పాల్గొన్నారు. స్టాళ్లను పరిశీలించారు. ఎంపీపీ బద్నాన ప్రమీల, ప్రజాప్రతినిధులు రెడ్డి సురేష్‌కుమార్‌, దండి అనంతకుమారి, గొర్లె గణపతిరావు, డీఎంహెచ్‌ఓ బి.జగన్నాధం, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శివకుమార్‌, ఎంపీడీఓ పార్వతి, వైద్యులు వెంకటరమణ, శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి భరోసా : ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్‌: ప్రజారోగ్యానికి ప్రభుత్వం పూర్తి ఆరోగ్య భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పార్వతీపురం పురపాలక సంఘం జగన్నాధపురంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు కూడా చేయించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ బి.గౌరీశ్వరి, వైస్‌ చైర్మన్‌ కొండపల్లి రుక్మిణి, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్‌ లీడర్‌ మంత్రి రవికుమార్‌, కౌన్సిలర్లు ఆర్‌.చిన్నంనాయుడు, ఆర్‌.బంగారు నాయుడు, వై.త్రినాథ, ఎస్‌.లావణ్య, మున్సిపల్‌ కమిషనర్‌ రామప్పల నాయుడు, ఎన్‌జీఓ ప్రెసిడెంట్‌ కిషోర్‌, వైద్యాధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


సీతానగరం: పౌష్టికాహారం స్టాల్స్‌నుద్దేశించి మాట్లాడుతున్న ఆర్డీ కె.హేమలత


సీతానగరం: వృద్ధురాలితో యోగక్షేమాలు అడిగి తెసుకుంటున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరంలో...

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాకరంగా అమలు చేస్తున జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ ఆరోగ్య భద్రత కల్పించడం జరుగుతుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాలేయ వ్యాధితో బాధపడుతున్న ఓ వృద్ధురాలిని ఎమ్మెల్యే పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌ వి.నాగేశ్వరరావు, ఎంపీడీఓ ఎంఎల్‌ఎన్‌ ప్రసాద్‌, డీఐఓ టి.జగన్మోహనరావు, పెదంకలాం పీహెచ్‌సీ వైద్యాధికారి రాధాకాంత్‌, సర్పంచ్‌ జి.దాసు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్‌ ఆధ్వర్యంలో పౌష్టికాహారం స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఆర్‌డీ కె.హేమలత సందర్శించారు.

రక్తహీనతలను తగ్గించే చర్యలు చేపట్టండి

బలిజిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష ఒకరోజు కార్యక్రమం కాదని రోగులకు ఆరోగ్య సమస్యలు తీరేవరకు నిరంతర వైద్య సేవలు అందించే ఆరోగ్య సంజీవని అని ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. పలగరలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అరసాడ, బలిజిపేట పీహెచ్‌సీల వైద్యాధికారులు, సర్పంచ్‌ యామల గౌరమ్మ, ఎంపీపీ నాగమణి, జడ్పీటీసీ రవికుమార్‌, మండల పార్టీ అధ్యక్షుడు మురళీకృష్ణ, మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, ఎంపీటీసీ ఎస్‌.రామక్రిష్ణమ్మ, కార్యదర్శి గౌరీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జేఏఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

పార్వతీపురం టౌన్‌: జగనన్న ఆరోగ్య సురక్ష(జేఏఎస్‌)ను సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డా.బి.జగన్నాధరావు అన్నారు. మండలంలోని విశ్వనాధపురం, పట్టణంలోని జగన్నాధపురంలో నిర్వహించిన జేఏఎస్‌ కార్యక్రమాలను శనివారం పరిశీలించారు. శిబిరం వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్లలో అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో ప్రజలకు రక్ష

- ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు రక్ష అని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పట్టణంలో తన గృహంలో స్థానిక విలేకర్లతో ఆయన శనివారం మాట్లాడారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని, ఎవరైనా అనారోగ్యాలతో ఉంటే వారిని గుర్తించి ప్రభుత్వమే వారికి చికిత్స అందించే సదుద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహించే వైద్య శిబిరాల్లో ప్రజలకు పరీక్షలతో పాటు ఉచిత మందులు అందజేస్తారన్నారు. అవసరమైతే ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్సలు చేయిస్తామని అన్నారు. ఈ శిబిరాలు పర్యవేక్షణకు అధికారులను నియమించడం జరిగిందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు విజయవంతమవ్వాలని పిలుపునిచ్చారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా నిలవాలన్నారు.

మూఢనమ్మకాలను వీడండి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న జేవీకే ప్రతినిధులు

పార్వతీపురం టౌన్‌: మూఢనమ్మకాల వెంట పడి భవిష్యత్‌ను నాశం చేసుకోవద్దని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాలనాయక్‌ అన్నారు. పార్వతీపురం ఏకలవ్య పాఠశాలలో విద్యార్థులకు మూఢనమ్మకాలపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాస్త్రీయ ఆలోచనలపై అవగాహన పెంచుకోవడం ద్వారా ఈ తరహా దురాచారాలకు, మూఢనమ్మకాలకు దూరంగా ఉండవచ్చునన్నారు. ఈ క్రమంలో పలు ఇంద్రజాల ప్రదర్శనలను నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంజూరు భాష మాట్లాడుతూ లక్ష్యం దిశగా విద్యార్థులు అడుగులు వేయాలని, ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ ఏబీవీపీ పట్నాయక్‌, జేవీకే జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళి, పి.రంజిత్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంలో భాగస్వాములుకండి

పార్వతీపురం: స్వచ్ఛతహై సేవా శ్రమదానం కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో, అన్ని గ్రామ పంచాయతీల్లో ఆదివారం ఉదయం 10గంటల నుండి ఒక గంట పాటు శ్రమదానం చేయాలని ఇన్‌చార్జ్‌ జిల్లా పంచాయతీ అధికారి నాగభూషణరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్‌ అభివృద్ధి అధికారులు, విస్తరణాధికారులు పంచాయతీ కార్యదర్శులకు తగు సూచనలు జారీ చేయాలన్నారు. కార్యక్రమం నిర్వహణపై జిల్లా కలెక్టర్‌ నిషాంత్‌కుమార్‌ ఆదేశాలు జారీ చేశారని, వాటిని విధిగా పాటించాలన్నారు. ఎంపీడీఓ ఆధ్వర్యంలో శాసనసభ్యులు, జెడ్పీటీసీలు, ఎంపీపీ, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. పంచాయతీల్లో సర్పంచ్‌ ఆధ్వర్యంలో గ్రామస్తులు, వార్డు మెంబర్లు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, యువతతో కార్యక్రమం నిర్వహించి శతశాతం విజయవంతం చేయాలని కోరారు. పంచాయతీ పరిధిలోని మహాత్మాగాంధీ విగ్రహాలను, పరిసర ప్రాంతాలను శుభ్రపరచడం, పరిసరాలను ఆహ్లాదకరంగా తయారు చేయడం వంటి కార్యక్రమాలను చేయాలని సూచించారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పరిహారం

- ఆర్‌డీవో శేషశైలజ


మాట్లాడుతున్న ఆర్‌డీవో శేషశైలజ

రామభద్రపురం: ప్రభుత్వ నిబంధనల ప్రకారమే తొలగించిన ఇళ్లకు పరిహారం ఇవ్వడం జరుగుతుందని ఆర్‌డీవో శేషశైలజ అన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా తారాపురం గ్రామంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న ఇళ్లను తొలగించాల్సి ఉండగా, స్థానిక తహసీల్దార్‌ కార్యాలయంలో ఆమె ఆ గ్రామ ప్రజలు, పెద్దలతో శనివారం సమావేశమయ్యారు. కొన్ని రూ.లక్షలు పెట్టి, నిర్మించుకుని, దశాబ్దాలుగా నివశిస్తున్న తమ ఇళ్లను తొలగించి, అన్యాయం చేయవద్దని, ఎక్కడైనా తమకు ఇళ్ల స్థలాలు చూపి, వాటిలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని గ్రామస్తులు ఆర్‌డీవోను కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉండడం వల్లే తొలగించక తప్పడం లేదన్నారు. ఈ విషయం కలెక్టర్‌ దృష్టికి తీసుకువెళ్లి, ల్యాండ్‌ ఎక్విజియేషన్‌లో భాగంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు అన్యాయం చేసే నిర్ణయాలను ప్రభుత్వం తీసుకోదన్నారు. గొంతెమ్మ కోర్కెలు కోరకుండా న్యాయబద్ధమైన కోర్కెలు కోరాలని సూచించారు. అనంతరం వీఆర్‌వోలతో సమావేశం నిర్వహించి, మండలంలోని అసైన్డ్‌ భూములు ఎంతమంది రైతుల సాగులో ఉన్నాయో తహసీల్దార్‌ రాజారావును అడిగి తెలుసుకున్నారు. ఏళ్ల తరబడి అసైన్డ్‌ భూములు సాగు చేస్తున్నప్పటికీ హక్కులు పొందని వారికి పట్టాల పంపిణీకి చర్యలు చేపడుతున్నామన్నారు.

పాము కాటుతో ఒకరికి అస్వస్థత

మక్కువ: మండలంలోని కొండరేజేరు గ్రామానికి చెందిన ఎం.సత్యనారాయణ శనివారం పాముకాటుతో అస్వస్థకు గురయ్యాడు. కాశీపట్నం గ్రామంలో ఓ ఇంటి నిర్మాణ పనులు చేస్తున్న సమయంలో పాము చేతిపై కాటు వేయడంతో సత్యనారాయణను మక్కువ పీహెచ్‌సీకి వైద్యచికిత్స నిమిత్తం స్థానికులు తరలించారు. వైద్యాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం సాలూరు సీహెచ్‌సీకు తరలించనున్నట్లు ఆయన తెలిపారు.

అన్న సమారాధన

మక్కువ: వినాయక నవరాత్రులు సందర్భంగా స్థానిక నాయుడు వీధిలో శనివారం అన్న సమారాధన కార్యక్రమాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు నిర్వహించారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, డీసీసీబీ డైరెక్టర్‌ మావుడి తిరుపతినాయుడు హాజరై, భక్తులకు ప్రసాదాన్ని వడ్డించారు. మండలంలోని పలు గ్రామాల నుండి వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే


కుటుంబానికి తనవంతు సాయం అందిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: మండలంలోని రాజయ్యపేట గ్రామంలో అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సాయం చేసి, తనలోని మానవత్వాన్ని చాటుకున్నారు. సారిపెంట ఈశ్వరరావు, రమణమ్మ ఇంట్లో ఇటీవల గ్యాస్‌ లీకై, ఇంట్లో ఉన్న అన్ని వస్తువులు, దుస్తులు కాలిబూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శనివారం సాయంత్రం ఆ గ్రామానికి వెళ్లి, వారిని పరామర్శించారు. అనంతరం ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

మెనూ అమలులో లోపాలుంటే చర్యలు


మధ్యాహ్న భోజనం రుచి చూసి, పరిశీలిస్తున్న ఎంఈవో త్రినాధరావు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకం మెనూ అమలులో ఎటువంటి లోపాలున్నా చర్యలు తీసుకునేందుకు వెనకాడేదిలేదని ఎంఈవో జె.త్రినాధరావు హెచ్చరించారు. మండలంలోని కాలంరాజుపేట యూపీ స్కూల్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగే ప్రార్థన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇటీవల హత్యకు గురైన పాఠశాల ఉపాధ్యాయుడు ఏగిరెడ్డి కృష్ణ మాస్టారి మృతికి సంతాపం తెలియజేస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మౌనం పాటించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాల రికార్డులు, మరుగుదొడ్ల నిర్వహణ, జగనన్న గోరుముద్ద పథంలో మెనూ అమలును పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తూనే రుచి,శుచితో కూడిన భోజనం అందించాలని తెలిపారు.

లైసెన్సులు లేకుండా దాణా విక్రయిస్తే చర్యలు

- పశుసంవర్థక ఏడీ దీనకుమార్‌


దాణ బస్తాల నుండి శాంపిల్స్‌ తీసిన పశుసంవర్థక శాఖ ఏడీ దీనకుమార్‌

సీతానగరం: ప్రభుత్వ అనుమతులు లేకుండా దాణా విక్రయాలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని పశు సంవర్ధక శాఖ సీతానగరం సబ్‌ డివిజన్‌ ఏడీ డాక్టర్‌ సీహెచ్‌ దీనకుమార్‌ హెచ్చరించారు. మరిపివలసలో వెంకటేశ్వర జనరల్‌ స్టోర్స్‌ పశు దాణా విక్రయ కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. దాణ బస్తాల నుంచి శాంపిల్స్‌ తీసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాణా లైసెన్స్‌ పొందిన డీలర్లు కల్తీ లేని, నాణ్యత ప్రమాణాలకు లోబడిన దాణాను విక్రయించాలన్నారు. ప్రజలకు కల్తీలేని పాలు పంపిణీ చేయడానికి పాడి పశువుల నుంచి పోషక విలువలతో కూడిన దాణా విక్రయించాలని సూచించారు. మరిపివలసలో ఉన్న రెండు దాణా విక్రయ కేంద్రాలను తనిఖీ చేసినట్టు తెలిపారు. దాణా విక్రయదారులు ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన కంపెనీలు తయారు చేస్తున్న నాణ్యమైన దాణా విక్రయించాలన్నారు. శాంపిల్స్‌ను పోషక విలువలను తెలుసుకునేందుకు ల్యాబ్‌కు పంపనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా రెండు గ్రామాల్లో దాణా బస్తాలు విక్రయిస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని వాటిపై త్వరలో సోదాలు చేసి విధిగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట పశువైద్య సిబ్బంది ఉన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం


వార్డులో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జోగారావు

- పట్టణంలో నా అడుగు మీ కోసమే కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్‌: సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పురపాలక సంఘం పరిధి 26వ వారుల్డో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, మున్సిపల్‌ అధికారులతో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను కలుసుకుని వార్డులో మంచినీరు బాగా వస్తుందా.., కాలువలు శుభ్రంగా ఉన్నాయా...., ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ అందరికీ సకాలంలో అందుతున్నాయా..., ఇవి కాకుండా వార్డులో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వార్డులో అపరిశుభ్రంగా ఉన్నచోట శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ బోను గౌరీశ్వరి, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, వార్డు కౌన్సిలర్‌ సభ్యులు కోరాడ శ్రీనివాసరావు (నాని), ఎస్‌.లావణ్య, మజ్జి శశికర్‌, నిమ్మకాయల సుధీర్‌, రణబేరి చిన్నం నాయుడు, బంగారి నాయుడు, వి.నేతాజి, పి.జయంతి, బి.ఆనంద్‌ జి.గాయత్రి, జేసీఎస్‌ కన్వీనర్‌ గొర్లి మాధవరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్‌ నాయకులు, జయబాబు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్‌ సిబ్బంది, వలంటీర్లు, స్థానికులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌ నిబంధనలు పాటించండి


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ పాపారావు

పార్వతీపురం టౌన్‌: పట్టణం, గ్రామాల్లో ప్రయాణికులకు సేవలందించే ఆటో డ్రైవర్లు విధిగా నిబంధనలు పాటించాలని పార్వతీపురం ట్రాఫిక్‌ ఎస్‌ఐ పాపారావు అన్నారు. శనివారం నో యాక్సిడెంట్‌ డే సందర్భంగా పట్టణంలో వాహన తనిఖీలు నిర్వహించి రహదారి భద్రతా నియమావళిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ఆటో డ్రైవర్‌లు ప్రయాణికులకు అసౌకర్యం కలిగించినా, వారిపై అమర్యాదగా ప్రవర్తించినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవన్నారు. ఓవర్‌లోడ్‌ ఎక్కించ రాదని ధనాపేక్షతో కాకుండా, మానవతా దృక్పథంతో వ్యవహరించాలన్నారు. వాహన పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సదస్సులో ట్రాఫిక్‌ సిబ్బంది పాల్గొన్నారు.

కౌన్సిల్‌లో టీడీపీ కౌన్సిలర్ల దౌర్జన్యం


పోడియం ఎక్కి మైక్‌ లాక్కొని మాట్లాడుతున్న టీడీపీ కౌన్సిలర్‌

- చైర్‌పర్సన్‌ను చుట్టిముట్టిన వైనం
- మైక్‌ లాక్కొని గందరగోళం సృష్టించిన కౌన్సిలర్లు

సాలూరు: మున్సిపల్‌ సర్వసభ్య సమావేశంలో టీడీపీ కౌన్సిలర్లు దౌర్జన్యానికి దిగారు. ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కారానికి పాటు పడాల్సిన వీరు తమ అధినేత చంద్రబాబు అరెస్టు అంశాన్ని కౌన్సిల్‌లో ప్రస్తావించి దౌర్జన్యానికి దిగారు. వివరాల్లోకి వెళ్తే.. కౌన్సిల్‌ సమావేశం చైర్‌పర్సన్‌ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన కమిషనర్‌ జయరాం ఆధ్వర్యంలో శనివారం కౌన్సిల్‌ హాల్‌లో జరిగింది. అభివృద్ధి పనులపై చర్చ జరుగుతుండగా టీడీపీ కౌన్సిలర్లు డీసెంట్‌ పత్రాన్ని చైర్‌పర్సన్‌గా ఇవ్వగా జీరో అవర్‌లో మాట్లాడదామని చైర్‌పర్సన్‌ సూచించారు. దాన్ని వారు తిరస్కరించి డీసెంట్‌ పత్రాన్ని తీసుకోవాలని చైర్‌పర్సన్‌కు అందించారు. ఈ సమయంలో ఆకస్మాత్తుగా టీడీపీ కౌన్సిలర్లు చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ, ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

చైర్‌పర్సన్‌ పోడియం వైపు దూసుకువెళ్లారు. చైర్‌పర్సన్‌ నుంచి దౌర్జన్యంగా మైక్‌ లాక్కొని ఆమెతో వాగ్వాదానికి దిగి గందరగోళం సృష్టించారు. ఈ సమయంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌కు రక్షణగా ఉంటూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అనుకూలంగా నినాదాలు చేశారు. ఈ సమయంలో ఇరు పార్టీల కౌన్సిలర్ల మధ్య తోపులాట చోటు చేసుకుంది. కౌన్సిల్‌లో సంబంధం లేని అంశాన్ని తీసుకొచ్చి దౌర్జన్యానికి దిగిన టీడీపీ కౌన్సిలర్లపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు డిమాండ్‌ చేశారు.